పథకాలు పేదల అభ్యున్నతికి సోపానాలు

- గడప గడపకూ మన ప్రభుత్వం'లో సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు
- ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించిన ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

గాండ్లపెంట: ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందిస్తున్నారు. అర్హత ఉంటే చాలు ఎవరి సిఫార్సు లేకుండానే పథకాలు అందుతున్నాయి. గతంలో ఎప్పుడూ ఇలాంటి పాలన చూడలేదు. జగనన్న మా అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. జీవితాంతం ఆయన వెన్నంటే ఉంటాం అని లబ్ధిదారులు తమ మనస్సులోని మాటను చెప్పారు. మండల పరిధిలోని మలమీదపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని కోటూరు, అరమడకవారిపల్లి, కుమ్మరవాండ్లపల్లి, కరణంవారిపల్లి గ్రామాల్లో శనివారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఇంటింటికీ వెళ్లి మూడున్నర సంవత్సరాల్లో ఆయా కుటుంబాలకు వివిధ పథకాలతో అందిన లబ్ధిని వివరించారు. పింఛన్లు ఒకటో తేదీనే ఠంచనుగా అందుతున్నాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సిమెంటు రోడ్లు, బోర్లు, ఇళ్లు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. అర్హులైన వారందరితో దరఖాస్తులు తీసుకుని మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన కొనసాగుతోందని, ఆయనకు అండగా నిలవాలని కోరారు. ఎంపీడీఓ అంజినప్ప, ఈఓఆర్డీ సునిత, హౌసింగ్ ఏఈ చంద్రారెడ్డి, జేఈ కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ పోతినేని కళావతి, వైఎస్ ఎంపీపీ భారతి ప్రతాపరెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ పోరెడ్డిచంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, నాయకులు అమానుల్లా, పోతినేని చలపతి, గంగాద్రి, విజయ్‌కుమార్‌రెడ్డి, శివారెడ్డి, మాజీ సర్పంచ్ జయప్ప, అల్లాబకష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీంద్రనాయక్, సర్పంచ్‌లు ఆంజనేయులు, నాగభూషణంరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శంకర్‌నాయుడు, బూత్ కన్వీనర్ గజ్జలర వీంద్రారెడ్డి, బీసీ కన్వీనర్ జక్కల నరసింహగౌడ్, సిద్దారెడ్డి, మైను, ఇక్బాల్, ఉత్తన్న పాల్గొన్నారు.

'సంక్షేమ' సారథి జగనన్నను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే డాక్టర్ పీవి సిద్దారెడ్డి


లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

గాండ్లపెంట: అవ్వ, తాతలు, దివ్యాంగులు, వితంతువులు ఇబ్బంది పడకుండా వలంటీర్ల ద్వారా ప్రతినెల 1వ తేదీనే ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేసే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. నూతనంగా మంజూరైన 122 పింఛన్లను శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సర్పంచ్ రహంతుల్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో సైతం 1వ తేదీన పింఛన్ అందించిన ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో కేవలం 39 లక్షల మందికి పింఛన్లు ఇచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం జగన్ 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నారన్నారు. కులమతాలకు అతీతంగా ఎవరి సిఫార్సులు లేకుండా.. అర్హులందరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రికి మీ అందరి చల్లని దీవెనలు ఉండాలని కోరారు. ఎంపీడీఓ అంజినప్ప, ఎంపీపీ తాతంజగన్మోహన్, వైస్ ఎంపీపీ గంగోజమ్మ, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కదిరి టౌన్: నంబులపూలకుంట మండలం ఎన్.రెడ్డివారిపల్లిలో పేదకుటుంబానికి చెందిన వలంటీర్ అల్లిమునా వివాహ ఖర్చులకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి శనివారం రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీపీ రాము, వాటర్ షెడ్ చైర్మన్ బయ్యారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు


గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ పోలప్ప

ఓడీ చెరువు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ పోలప్ప అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. జగనన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు చేస్తున్న జియోట్యాగింగ్‌ను పరిశీంచారు. మండలంలో 4 వేలకు పైగా ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. అర్హత ఉన్నా ఇల్లు మంజూరు కానివారు వివరాలు సమర్పిస్తే పరిశీలిస్తామన్నారు. గృహ లబ్ధిదారులందరూ త్వరితగతిన ఇల్లు నిర్మించుకోవాలన్నారు. సర్పంచు శివశంకర్‌రెడ్డి, గ్రామ కన్వీనర్ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

నల్లగుట్లపల్లి గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపీడీఓ పోలప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాల ప్రదర్శనపై ఆరా తీశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి విషజ్వరాలు రాకుండా చూడాలన్నారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సీఎం వెంకటేశ్వరరావు

కదిరి టౌన్: జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నటు సీనియర్ సివిల్ జడ్జి సీఎం వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజీ ద్వారా పరిష్కారమయ్యే కేసులను లోక్ అదాలత్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కుమారి ఎస్. ప్రతిమ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి సుందరి, డీఎస్పీ భవ్యకిషోర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పథకాలపై అవగాహన


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఈదులపల్లి, రంగాపురం గ్రామాల్లో శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గురించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా సూపర్ మార్కెట్ నిర్వహించొద్దు

రొళ్ల: ప్రభుత్వ అనుమతి పొందకుండా సూపర్ మార్కెట్ నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీమ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని మడకశిర ప్రధాన రోడ్డు పక్కన నిర్వహిస్తున్న మారుతి సూపర్ మార్కెట్‌ను తనిఖీ చేశారు. తొలుత దొమ్మరహట్టి సమీపంలోని డాక్టర్ బాలయేసు గురుకుల పాఠశాలను సందర్శించారు. భోజనం నాణ్యత, పరిశుభ్రతపై విద్యార్థులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలం చెల్లిన నిత్యావసర సరుకులతో తయారు చేసిన పదార్థాలను ప్రజలకు విక్రయించరాదన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యతతో కూడిన సరుకులు, పదార్థాలను విక్రయించాలన్నారు. మారుతి సూపర్ మార్కెట్ నిర్వహణకు అనుమతి తీసుకోకపోవడంతో యజమానికి నోటీసులు జారీ చేశారు. వెంటనే అనుమతి తీసుకోకపోతే సూపర్ మార్కెట్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ధనుర్మాస పూజలు


తాడిమర్రిలో పూజలందుకుంటున్న లక్ష్మీ చెన్నకేశవస్వామి

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదలు అందించి అన్నదానం చేశారు.

తాడిమర్రి: మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవ ఆలయం, ఏకపాదంపల్లి, నార్సింపల్లి గ్రామాల్లోని శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయాల్లో శనివారం ధనుర్మాస పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మూలవిరాట్‌లకు ఆలయ పూజారులు వెండి ఆభరణాలను తొడిగి పూలమాలలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పేరూరు కాజ్‌వే పనులు వేగవంతం చేయండి


పేరూరులో తెగిన కాజ్‌వేను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

రామగిరి: మండలంలోని పేరూరులో రెండు నెలల క్రితం తెగిన కాజ్‌వే పనులను వెంటనే పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ డీఈ వెంకటసుబ్బయ్య ఆదేశించారు. అప్పర్‌పెన్నార్ ప్రాజెక్ట్ (పేరూరు డ్యాం) కింద కళ్యాణదుర్గం- పావగడ వెళ్లే దారిలో భారీ వర్షాలకు కాజ్‌వే తెగిపోయింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రూ.1.95 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టనున్నారు. శనివారం ఆయన కాజ్‌వే వద్దకు చేరుకొని పరిశీలించారు. పనులు త్వరితగతిన చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను డీఈ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ హరిక, దాసరి మోహన్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు చిన్నారులకు రక్ష


టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: రెండేళ్లలోపు ప్రతి చిన్నారికీ వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న, ఏఎన్ఎం చంద్రకళ తెలిపారు. శనివారం స్థానిక సబ్ సెంటర్‌లో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ ప్రతి చిన్నారికీ తల్లిదండ్రులు విధిగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. ప్రతి బుధవారం, శనివారం టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు శివలక్ష్మి, నాగేంద్రమ్మ, వీరమ్మ, లక్ష్మి, అంగన్‌వాడీ సహాయకురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడా సమ్మేళనానికి బైకుల వితరణ


మోటార్ సైకిళ్ల తాళాన్ని ఆర్‌జే రత్నాకర్ రాజుకు అందజేస్తున్న మేనేజర్ త్యాగరాజన్

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యార్ లర్నింగ్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న సాంస్కృతిక క్రీడా సమ్మేళనానికి హీరో మోటార్‌కార్ప్ సంస్థ 35 మోటార్ సైకిళ్లను అందజేసింది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజుకు శనివారం వీటిని సంస్థ మేనేజర్ త్యాగరాజన్ అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక గోకులంలోని సత్యసాయి స్పోర్ట్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్‌జే రత్నాకర్ రాజు మాట్లాడారు. ఏటా జనవరి 11న సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ పరిధిలోని విద్యాసంస్థలు సత్యసాయి క్రీడా సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సమ్మేళనంలో భాగంగా నిర్వహించే మోటార్ సైకిల్ విన్యాసాల్లో బైకులను వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌టీరియం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సాయిగిరిధర్, సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ రిజిస్ట్రార్ పల్లవ్ కుమార్, కంట్రోలర్ సంజయ్ సహనీ, డైరెక్టర్ రాఘవేంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.


జోరుగా కర్ణాటక మద్యం రవాణా

- సరిహద్దుల్లో కొరవడిన నిఘా
- చోద్యం చూస్తున్న సెబ్ అధికారులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం (ఫైల్)

తనకల్లు: మండలంలో కర్ణాటక మద్యం రవాణా జోరుగా సాగుతోంది. అక్రమ మద్యం రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసులు, సెబ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తనకల్లు మండలం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న చాకివేలు (కర్ణాటక) ఉంది. అక్కడి నుంచి పెద్దపల్లి, నక్కరాళ్లతండా, కోటపల్లి, మరాల్లపల్లి గ్రామాల మీదుగా రాత్రి సమయాల్లో పెద్ద ఎత్తున కర్ణాటక మద్యాన్ని ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లలో మండలానికి తరలిస్తున్నారు. అదేవిధంగా చేలూరు నుంచి కందుకూరు మీదుగా ఎర్రగుంటపల్లి, బొంతలపల్లి గుండా మద్యాన్ని తీసుకొచ్చి మండలంలో విక్రయిస్తున్నారు. కర్ణాటకలో ఒక్కో టెట్రా ప్యాకెట్ (90 ఎంఎల్)ను రూ. 35, రూ. 45తో కొనుగోలు చేసి ఇక్కడ రూ. 90 నుంచి రూ. 100 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మారుమూల గ్రామాల్లో సైతం కర్ణాటక మద్యం అందుబాటులో ఉందంటే వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. పొరుగున ఉన్న గాండ్లపెంట, ఎన్‌పీ కుంట, గాలివీడు, రాయచోటి తదితర ప్రాంతాలకు పెద్ద ఎత్తున మద్యాన్ని సరఫరా చేస్తూ రోజుకు రూ.లక్షల్లోనే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

నిఘా ఉంచాం



మండలంలోకి కర్ణాటక మద్యం రవాణా కాకుండా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల వద్ద గట్టి నిఘా ఉంచాం. కర్ణాటక మద్యం రవాణాపై సమాచారం అందగానే ఎప్పటికప్పుడు దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకోవడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై కేసులను నమోదు చేస్తున్నాం.
– రాంభూపాల్, ఎస్ఐ, తనకల్లు

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

హిందూపురం: మండలంలోని పూలకుంట జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న బి.భైరవమూర్తి రాష్ట్రస్థాయి త్రోబాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం చంద్రమౌళీశ్వర, ఫిజికల్ డైరెక్టర్ జగదీష్ శనివారం తెలిపారు. ఈనెల 11, 23 తేదీల్లో కాకినాడ, నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో భైరవమూర్తి పాల్గొంటాడన్నారు.

లబ్ధిదారులకు అన్ని విధాలా సహకారం

రాప్తాడురూరల్: ఇళ్ల నిర్మాణాల విషయంలో లబ్ధిదారులకు అన్ని విధాలా సహకరిస్తామని డీఎల్‌డీఓ ఓబుళమ్మ, ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, ఎంపీడీఓ బాబాఫక్రుద్దీన్ అన్నారు. శనివారం అనంతపురం రూరల్ మండలం కొడిమి జగనన్న కాలనీ–1,2 లేఅవుట్లలో 'హౌసింగ్ డే' నిర్వహించారు. లబ్ధిదారులతో అధికారులు మాట్లాడారు. ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న కాలనీల ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పేదలందరికీ ఇళ్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. లబ్ధిదారులు ముందుకొచ్చి ఇళ్ల నిర్మాణాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ అనంతపురం మండల కన్వీనర్ బండి పవన్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు, పీఆర్ జేఈ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ నల్లప్ప, పంచాయతీ కార్యదర్శులు, కొడిమి, రాచానపల్లి, పాపంపేట సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి తొలగిన అడ్డంకి


భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ, ఆర్డీటీ సిబ్బంది

బత్తలపల్లి: మండలంలోని సంఘమేశ్వరక్షేత్రం సమీపంలో రోడ్డు కమ్ చెక్‌డ్యాం నిర్మాణం వద్ద రోడ్డు నిర్మాణానికి అడ్డంకి తొలగింది. వివరాలు.. క్షేత్రం వద్ద ఆర్డీటి సంస్థ రూ.1.39 కోట్లతో రోడ్డు కమ్ చెక్‌డ్యాం పనులు చేపట్టింది. అయితే బత్తలపల్లి మండలం నుంచి ధర్మవరం మండలంలోని గ్రామాలకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి భూమి సేకరించగా తన పొలంలోనే ఎక్కువ భాగం సేకరించారని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి చొరవ తీసుకొని ఆర్డీటీ అధికారులు, రెవెన్యూ అధికారులతో చర్చించి సర్వే చేయించారు. భూమి ఎక్కువగా నష్టపోకుండా చర్యలు తీసుకోవడంతో రోడ్డు నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి.

బియ్యం, బేడల సేకరణకు 11న వేలం

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన బియ్యం, బేడల విక్రయానికి ఈ నెల 11న ఆలయంలో ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, చైర్మన్ గోపాలకృష్ణ శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.50 వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. అదేవిధంగా స్వామివారికి అలంకరించిన పూలు, పూలమాలలు, తులసీ మాలలతో తయారు చేసిన దూప్ స్టిక్స్, అగర్‌బత్తీ, గోఉత్పత్తులు ఐదేళ్లపాటు విక్రయించుకునేందుకు ఈ నెల 11వ తేదిన వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.25వేల ధరావత్తు చెల్లించాల్సి ఉంటుదన్నారు.

రేపు మండల సమావేశం

ఓడీ చెరువు: ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పోలప్ప, ఎంపీపీ ఫర్వీన్‌భాను శనివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, అధికారులు హాజరు కావాలన్నారు.

బైకిస్టుకు గాయాలు


ప్రథమ చికిత్స చేస్తున్న ఈఎంటీ హైమావతి

ఓడీ చెరువు: మండలంలోని ఎస్.కొట్టాల సమీపంలో కొండకమర్ల నల్లమాడ రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లమాడకు చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి గాయపడ్డాడు. ఈయన బైక్‌పై కొండకమర్ల నుంచి నల్లమాడకు వెళ్తుండగా ఎస్.కొట్టాల వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. ముఖం, తలకు గాయాలు కావడంతో 108 సిబ్బంది వచ్చి కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్యాలెండర్, డైరీ అవిష్కరణ


ఆవిష్కరిస్తున్న ఎంఈఓ గోపాల్ నాయక్

ఎన్‌పీకుంట: ఎస్టీయూ రూపొందించిన కొత్త సంవత్సరం క్యాలెండర్, డైరీని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఎంఈఓ గోపాల్‌నాయక్ ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు తిరుపాల్‌నాయక్, ఎస్టీయు జిల్లా గౌరవాధ్యక్షులు రామాంజులుయాదవ్, కౌన్సిలర్ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న వాహనాల వేలం

తాడిమర్రి: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 10వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం 10గంటలకు వేలం పాట ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు రూ.వెయ్యి రూపాయలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ ఏడీ నాగరాజు తదితరులు

కొత్తచెరువు: శ్రీసత్యసాయి జిల్లా పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను శనివారం డీఈఓ కార్యాలయ ఆవరణంలో విద్యాశాఖ ఏడీ నాగరాజు ఆవిష్కరణ చేశారు. జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్ రెడ్డి, గౌరవాధ్యక్షులు బాబూసాహెబ్, ఉదయ్ భాస్కర్‌రెడ్డి, ఆజాద్, చంద్రశేఖర్ రెడ్డి, కేశవ, నరసింహారెడ్డి, సోమ్లానాయక్ తదితరులు ఈ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు అశ్వర్థరెడ్డి మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నం సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జానకంపల్లికి చెందిన గంగ్లూరి అశ్వర్థరెడ్డి(74) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం వెళ్లి అశ్వర్థరెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అశ్వర్థరెడ్డి సోదరుడు అమరదీప్ అశ్వర్థరెడ్డి, కుమారుడు సాయినాథరెడ్డిని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అశ్వర్థరెడ్డి కృషి చేశారని గుర్తు చేసుకున్నారు.

చేనేతలు ఆధునిక డిజైన్లపై పట్టు సాధించాలి


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న చేనేత జౌళిశాఖ ఏడీ రమేష్‌బాబు

ధర్మవరం అర్బన్: మరమగ్గాలతో పోటీ పడేందుకు చేనేతలు వస్త్రాల తయారీలో ఆధునిక డిజైన్లు పొందుపరచడంలో శ్రద్ధ పెట్టాలని చేనేత జౌళి శాఖ ఏడీ రమేష్‌బాబు సూచించారు. ఏపీ చేనేత కార్మిక సంఘం రూపొందించిన కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం ఆయన స్థానిక కదిరిగేటు వద్ద నున్న నేతన్న విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేనేత కార్మిక సంఘం నాయకులు జింకా చలపతి, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సిమెంటు పంపిణీ


సిమెంట్ పంపిణీకి ముందు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రెండవ విడతలో వెంగళమ్మచెరువు గ్రామంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు శనివారం సిమెంటు అందజేశారు.హౌసింగ్ కార్యాలయం వద్ద ధ్రువపత్రాలు తీసుకున్న లబ్ధిదారులకు మామిళ్లకుంట క్రాస్‌లోని హౌసింగ్ గోడౌన్‌లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసారెడ్డి, హౌసింగ్ ఏఈ మహమ్మద్ గౌస్ 48 మందికి సిమెంటు అందజేశారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ బాబయ్య పాల్గొన్నారు.

ఫ్యాప్టో కార్యవర్గం ఎన్నిక


శ్రీనివాసులు, చైర్మన్

కొత్తచెరువు: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం శ్రీసత్యసాయి జిల్లా ఫ్యాప్టో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కోడూరు శ్రీనివాసులు(ఏపీటీఎఫ్), జనరల్ సెక్రటరీగా రామకృష్ణ(శాప్), కో చైర్మన్లుగా సురేష్ బాబు (డీటీఎఫ్), చిన్నప్పయ్య, అబ్దుల్ మతీన్(బీటీఏ), డిప్యూటీ సెక్రెటరీలుగా నాగేంద్ర(యూటీఎఫ్), రామ్మోహన్ (ఎస్టీయూ), హరిప్రసాద్‌రెడ్డి (ఏపీటీఎఫ్ 1938) ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా సురేష్ బాబు, హెచ్ఎం వెంకటనాయుడు, చెన్నయ్య, కార్యవర్గ సభ్యులుగా జయచంద్రా రెడ్డి, త్రిమూర్తి, సుబ్బారావు, సుధాకర్, శ్రీనివాసులు, నాగరాజు, ఓబిరెడ్డి, అబ్దుల్ వాజిద్‌ను ఎంపిక చేసినట్లు పరిశీలకులు నాగరాజు తెలిపారు.

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఆత్మకూరు: మండలంలోని రైతులు పీఎం కిసాన్‌కు సంబంధించి ఆధార్ ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఈఓ సుజిత, విజయ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలోని ఇంకా ఈకేవైసీ చేయించని రైతులకు పీఎం కిసాన్‌కు సంబంధించి నగదు ఖాతాలకు జమ కాదని తెలిపారు. మండల వ్యాప్తంగా 3 వేల మంది వరకు ఉన్నారన్నారు.